సాక్షి
పార్వతీపురం మన్యం

శుక్రవారం । 17 । అక్టోబర్ । 2025



ఆనందం వెంట అంధకారం

జాతి, కుల, మత,వర్గ విభేదాలను విస్మరించి సమైక్యంగా ఆనందోత్సాహాలతో జరుపుకునే పండగ దివ్య దీపావళి.

- IIలో



గిరిజనం గుండెఘోష పట్టదా..?

గిరిజన విద్యార్థుల వరుస మరణాల నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు.

- IIలో



మంత్రి బాధ్యత వహించాలి

కోటి ఆశలతో బిడ్డలను పాఠశాలలకు పంపగా అక్కడ సరైన సదుపాయాలు లేక అనారోగ్యాలకు గురై అమాయక గిరిజన బిడ్డలు మరణిస్తున్నారు.

- IIలో

సూది మందే దిక్కు..!



- 17 రోజులుగా సమ్మెలో పీహెచ్‌సీ వైద్యులు
- చుట్టం చూపుగా వస్తున్న ప్రత్యామ్నాయ వైద్యులు
- మలేరియా వచ్చినా వైద్యసిబ్బందే ఆధారం

సమస్యలు పరిష్కరించాలంటూ పీహెచ్‌సీ వైద్యులు సమ్మెబాట పట్టడం, ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పార్వతీపురం మన్యం జిల్లా ప్రజలకు ఎటువంటి ఆరోగ్య సమస్య వచ్చినా పరీక్షించి నయం చేసే దిక్కు లేకుండా పోయింది. ఏదో ఒక ఆరోగ్య సమస్యతో ఆస్పత్రికి వస్తున్న రోగులు ఆస్పత్రిలో వైద్యుడు లేక సిబ్బంది చేసే వైద్యం పొంది ఇళ్లకు తిరిగి వెళ్తున్నారు. జిల్లాలో మలేరియా మారణ కాండ విజృంభిస్తున్న తరుణంలో ప్రభుత్వం పీహెచ్‌సీ వైద్యుల సమ్మె విషయంలో వారికి న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాల్సి ఉందని జిల్లా ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.

సాక్షి, పార్వతీపురం మన్యం/మక్కువ/పార్వతీపురం రూరల్

గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలందించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు సుమారు 17 రోజులుగా సమ్మెలో ఉన్నారు. వారి డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు రాకపోవడంతో పూర్తిస్థాయిలో విధులను బహిష్కరించారు. విజయవాడలో జరిగే ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. దీంతో పీహెచ్‌సీల్లో వైద్యసేవలు పడకేశాయి. జిల్లాలో 37 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. వాటిలో సుమారు 67 మంది వైద్యులు పని చేస్తున్నారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం గత నెల 26 నుంచి వివిధ రూపాల్లో నిరసనలు చేస్తున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం దిగిరాకపోవడంతో గత నెలాఖరు నుంచి ఓపీ, అత్యవసర సేవలను సైతం నిలిపివేసి..సమ్మెలోకి వెళ్లిపోయారు. పీహెచ్‌సీల్లో సేవలు నిలిచిపోకుండా వైద్యశాఖాధికారులు విజయనగరం, పార్వతీపురం జిల్లా ఆస్పత్రులు, వైద్య కళాశాల, మిమ్స్, ఆయుష్, ఇతర విభాగాల నుంచి డిప్యుటేషన్‌పై సుమారు 35 మందిని పంపించారు. వారిలో చాలామంది వేర్వేరు స్పెషలిస్టులు కావడంతో మొక్కుబడిగా ఇలా వచ్చి, అలా చూసి వెళ్లిపోతున్నారు. ఫలితంగా రోగులకు సరైన చికిత్స అందడం లేదు.

ఏ చికిత్స చేయాలన్నా..సిబ్బందే దిక్కు

రెగ్యులర్ వైద్యాధికారులు లేకపోవడంతో వైద్యసిబ్బందే డాక్టర్ల అవతారం ఎత్తుతున్నారు. చిన్నచిన్న సమస్యలకు వైద్యం చేసేస్తున్నారు. కాస్త తీవ్రత అనిపించినా..తాము రిస్క్‌లో పడలేమంటూ, జిల్లా ఆస్పత్రికి వెళ్లిపోవాలని చెబుతున్నారు. ఇప్పుడు చాలా వరకు పీహెచ్‌సీల్లోనే ప్రసవాలు జరిగిపోతున్నాయి. వైద్యుల సమ్మెతో వాటికీ ఆటంకం కలుగుతోంది. పార్వతీపురం మండలం డోకిశీల పీహెచ్‌సీలో సుమారు 70 వరకు ఓపీ నిత్యం ఉండేది. నెలకు సగటున 10 ప్రసవాలు జరిగేవి. ఇదే మండలం పెదబొండపల్లిలో 5–6 వరకు ప్రసవాలు అవుతుండేవి. గతంలో వైద్యుల పర్యవేక్షణలో ఏఎన్‌ఎంలు వాటిని చేసేవారు. ఇప్పుడు గర్భిణులు ధైర్యం చేస్తేనే ముందుకొస్తున్నారు. లేకుంటే జిల్లా ఆస్పత్రికి పంపించేస్తున్నారు. దాదాపు అన్ని పీహెచ్‌సీల పరిధిలోనూ ఇదే పరిస్థితి ఉంది. ప్రస్తుతం మలేరియా, కామెర్ల కేసులు అధికమవుతున్నాయి. పీహెచ్‌సీ స్థాయిలో వాటికి వైద్యం అందడం లేదు. దీంతో సర్వజన ఆస్పత్రికి రోగుల తాకిడి పెరుగుతోంది. ప్రధానంగా వివిధ వసతిగృహాలు, పాఠశాలల నుంచి జ్వరాలతో బాధ పడుతూ వచ్చే విద్యార్థుల సంఖ్య అధికమవుతోంది. గురువారం జిల్లా ఆస్పత్రిలో పది మంది విద్యార్థులు చేరారు. మరోవైపు పీహెచ్‌సీల్లో పని చేస్తున్న ప్రత్యామ్నాయ వైద్యుల్లోనూ అసంతృప్తి పెరుగుతోంది. తమకు సంబంధం లేని విధులు ఇలా ఎన్ని రోజులు చేయాలంటూ ఆవేదన చెందుతున్నారు.

సాలూరు మండలంలోని గిరిశిఖర గ్రామం నుంచి షాల్మీ అనే మహిళ గొంతు, చెవినొప్పితో బాధ పడుతూ మక్కువ పీహెచ్‌సీకి వచ్చింది. ఆయుష్ వైద్యుడు మహేష్ ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మక్కువ మండలంలోని శంబరలో సైతం ఇదే పరిస్థితి ఉంది. దుగ్గేరు ఆయుష్ ఆస్పత్రి వైద్యురాలు ఇందిర..శంబర పీహెచ్‌సీలోనూ ఓపీ చూడాల్సి వస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే..ఆయుష్, హోమియోపతి వంటి క్రమవ్యవస్థ దెబ్బతింటుందని వైద్యులు గుసగుసలాడుకుంటున్నారు.



మక్కువ పీహెచ్‌సీలో గొంతు, చెవి నొప్పితో బాధ పడుతున్న మహిళను పరీక్షిస్తున్న ఆయుష్ వైద్యుడు మహేష్

ఈ చిత్రంలోని మహిళ పేరు పద్మ. ఆమె చేతిలో ఉన్న చిన్నారి కొద్దిరోజులుగా మలేరియాతో బాధ పడుతోంది. గిరిశిఖర ప్రాంతం నుంచి మూడు రోజులుగా పార్వతీపురం మండలం డోకిశీల పీహెచ్‌సీకి వస్తోంది. అక్కడ వారికి సిబ్బంది ఇచ్చే సూది మందే దిక్కు. గతంలో ఇక్కడ ఇద్దరు వైద్యులు ఉండేవారు. ప్రస్తుతం సమ్మె కావడంతో ఎవరూ రావడం లేదు. జిల్లా వైద్యశాఖాధికారులు ప్రత్యామ్నాయంగా పిడియాట్రిషియన్‌ను జిల్లా ఆస్పత్రి నుంచి పంపిస్తున్నారు. చుట్టుపక్కల ఉన్న 52 గ్రామాలతోపాటు.. సమీపంలో ఉన్న దుగ్గేరు, ఒడిశాలోని కొన్ని ప్రాంతాల ప్రజలకూ ఈ ఆస్పత్రే శరణ్యం.



మలేరియాతో బాధ పడుతూ డోకిశీల పీహెచ్‌సీకి చిన్నారితో వచ్చిన గిరిజన మహిళ

దబ్బగడ్డ గ్రామానికి చెందిన సింహాచలం కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. మక్కువ పీహెచ్‌సీకి వెళ్తే.. అక్కడి సిబ్బంది నామమాత్రంగా కొన్ని పరీక్షలు చేశారు. వైద్యం అందించే పరిస్థితి లేకపోవడంతో సాలూరు సీహెచ్‌సీకి వెళ్లాలని సూచించారు.



ఆస్పత్రి బల్ల వద్దే వేచి చూస్తున్న సింహాచలం

ఈ చిత్రంలోని విద్యార్థి పేరు కె.అఖిల్. డోకిశీల ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. దసరా సెలవులకు ఇంటికి వెళ్లాక అనారోగ్యం బారిన పడ్డాడు. అక్కడ కొద్దిరోజులు చికిత్స పొంది, పాఠశాలకు తిరిగొచ్చాడు. అప్పటికీ జ్వరం తగ్గకపోవడంతో పరీక్షలు చేయగా..మలేరియా అని తేలింది. పాఠశాల పక్కనే డోకిశీల పీహెచ్‌సీ ఉంది. అక్కడ వైద్యసేవలు అందకపోవడంతో జిల్లా ఆస్పత్రికి తరలించారు. ముందురోజు ఇదే ఆశ్రమ పాఠశాల నుంచి మలేరియాతో బాధ పడుతున్న ఆరో తరగతి విద్యార్థి కె.రాజేష్‌ను కూడా జిల్లా ఆస్పత్రికి తరలించారు.



సిక్ రూంలో ఉన్న విద్యార్థిని పరిశీలిస్తున్న ఏఎన్‌ఎంలు

పార్వతీపురం మండలం పెద బొండపల్లి పీహెచ్‌సీలో గత నెల వరకు ఇద్దరు వైద్యులు ఉండేవారు. సమ్మె కారణంగా ఇద్దరూ గత నెలాఖరు నుంచి విధులకు రావడం లేదు. దీంతో విజయనగరం మిమ్స్ నుంచి హౌస్ సర్జన్‌ను తాత్కాలికంగా డిప్యుటేషన్‌పై నియమించారు. రెగ్యులర్ వైద్యాధికారులు లేకపోవడం వల్ల ఇక్కడ రోగులకు పూర్తిస్థాయిలో వైద్యం అందడంలేదు. వచ్చిన వారిని సైతం జిల్లా ఆస్పత్రికి పంపించేస్తున్నారు. ఫలితంగా గతంలో 50–60 వరకు ఉండే ఓపీ..ఇప్పుడు 30కి పడిపోయింది. చిన్నపాటి ఆరోగ్య సమస్యలకు ఏఎన్‌ఎం, అటెండర్, ఫార్మాసిస్టే దిక్కవుతున్నారు. పురుడు పోయాలన్నా..ఏఎన్‌ఎంలే ధైర్యం చేయాలి.



పెదబొండపల్లి ఆస్పత్రి ఆవరణలో పడిగాపులు కాస్తున్న రోగి



చిన్నారికి వైద్యం అందిస్తున్న సిబ్బంది



డోకిశీల పీహెచ్‌సీలో వైద్యసేవలందిస్తున్న పిడియాట్రిషియన్

న్యూస్‌రీల్

టిడ్కో గృహాల పరిశీలన



టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ డా.ధర్మచంద్రా రెడ్డి

సాలూరు: పట్టణంలోని టిడ్కో గృహాలను హౌసింగ్ పీడీ డా.ధర్మచంద్రారెడ్డి గురువారం పరిశీలించారు. టిడ్కో గృహాల నిర్మాణాల ప్రగతి, అక్కడ వసతులు, సదుపాయాల కల్పన తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు.

పచ్చకామెర్లతో కేజీహెచ్‌లో చేరిన విద్యార్థులు

సాలూరు రూరల్: మండలంలోని బొడ్డవలస డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశ్రమపాఠశాల విద్యార్థులు నాలుగురోజుల క్రితం పచ్చకామెర్లతో విశాఖలోని కేజీహెచ్‌లో చేరారు. ఈ మేరకు పాఠశాల ఉపాధ్యాయులు తెలిపిన వివరాల ప్రకారం దసరా సెలవులకు ఇంటికి వెళ్లిన వై.ఆకాష్ (9వతరగతి) కె.భార్గవ రావు(8వ తరగతి), జె.పార్థసారథి(8వ తరగతి) కె.సాత్విక్ (6వ తరగతి) సెలవులు ముగిసినా హాస్టల్‌కు రాకపోవడంతో పాఠశాల ఉపాధ్యాయులు పిల్లల తల్లిదండ్రులను సంప్రదించారు. దీంతో వారు సమాధానమిస్తూ అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరినట్లు చెప్పడంతో పాఠశాల ఉపాధ్యాయుడు యూసఫ్ పిల్లల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు కేజీహెచ్‌కు వెళ్లారు. ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని పాఠశాల ప్రిన్సిపాల్ పి.మూర్తి తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు విశాఖపట్నంలో పనులు చేసుకుంటుండడంతో సెలవులకు వెళ్లిన విద్యార్థులు కేజీహెచ్‌లో చేరినట్లు తెలిపారు.

డోలీలో ఐదు కిలోమీటర్లు

- గిరిజనులకు తప్పని మోత కష్టాలు



చోడిపల్లి పూలోను డోలీలో తరలిస్తున్న కుటుంబసభ్యులు

పాచిపెంట: రహదారి సౌకర్యం లేకపోవడంతో గిరిజనులకు డోలీ మోతలు తప్పడం లేదు. దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడి నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులను, పురిటి నొప్పులు వచ్చిన గర్భిణులను, అస్వస్థతకు గురైన బాలింతలను, ఇలా ఏ రోగం వచ్చినా ఆస్పత్రికి తరలించాలంటే డోలీ కట్టాల్సిందే. ఎన్ని ప్రభుత్వాలు మారినా తమకు మాత్రం రహదారి కష్టాలు తీరడంలేదని గిరిజనులు వాపోతున్నారు. పాచిపెంట మండలంలోని కేరంగి పంచాయతీ కోదులమడ గ్రామానికి చెందిన చోడిపల్లి పూలో అనే గిరిజన వద్దుడు అనారోగ్యంతో గురువారం తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో కుటుంబసభ్యులు డోలీలో సుమారు 5 కిలోమీటర్ల దూరం నందేడవలస వరకు మోసుకువెళ్లి అక్కడినుంచి ఫీడర్ అంబులెన్స్‌లో గురువునాయుడుపేట పీహెచ్‌సీకి తరలించారు. సకాలంలో వైద్యులు చికిత్స అందించడంతో ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉంది. అత్యవసర పరిస్థితుల్లో తమకు డోలీలే శరణ్యమవుతున్నాయని, ప్రభుత్వ పెద్దలు స్పందించి రహదారి సౌకర్యం కల్పించాలని స్థానిక సర్పంచ్ సోములు లచ్చయ్య కోరారు.

దైవానుగ్రహంతోనే లోక కల్యాణం

బొబ్బిలి: దైవానుగ్రహంతోనే లోక కల్యాణం సాధ్యమని త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్, బృందావన రామానుజ జీయర్‌లు అన్నారు. బొబ్బిలి కంచర వీధిలోని కల్యాణవేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులకు ప్రవచనాలు, మంగళా శాసనాలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక పురోహితులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పైడితల్లి వనంగుడి హుండీల ఆదాయం లెక్కింపు



ఆదాయం లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈఓ శిరీష

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి వనంగుడి హుండీల ఆదాయాన్ని రైల్వేస్టేషన్ వద్ద ఉన్న అమ్మవారి ఆలయ ఆవరణలో గురువారం లెక్కించారు. 42 రోజులకు రూ.12లక్షల 52వేల 606 నగదు లభించినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష తెలిపారు. రామతీర్థం ఈఓ వై.శ్రీనివాసరావు పర్యవేక్షణలో సాగిన ఆదాయం లెక్కింపులో ధర్మకర్తల మండలి సభ్యులు పద్మావతి, కుమారి, తామేశ్వరరావు పాల్గొన్నారు.

2.58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం

- జిల్లాలో 180 ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- పౌరసరఫరాలశాఖ అధికారి బాల సరస్వతి

వీరఘట్టం: ఈ ఏడాది ఖరీఫ్‌లో 2.58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా చేసుకున్నామని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి ఎం.బాల సరస్వతి తెలిపారు. ఈ మేరకు గురువారం వీరఘట్టం వచ్చిన ఆమె మీడియాతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 356 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయని, వాటి పరిధిలో 180 ధాన్యం కొనుగోలు కేంద్రాలను గుర్తించామన్నారు. ఇప్పటికే 104 మంది మిల్లర్లు ధాన్యం మర పట్టించేందుకు సముఖత చూపారని తెలిపారు. ధాన్యం కొనుగోలు పారదర్శకంగా చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. కొద్ది రోజుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని చెప్పారు.



వీరఘట్టం: మాట్లాడుతున్న జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బాల సరస్వతి, పక్కన తహసీల్దార్ కామేశ్వరరావు

ధాన్యం కొనుగోలుకు పటిష్ట ఏర్పాటు చేయాలి

పార్వతీపురం రూరల్: ఖరీఫ్ సీజన్‌లో 2.5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇందుకు అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ రవాణా, గోనెసంచులు వంటివి సిద్ధం చేసుకోవాలని సూచిస్తూ గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, సమస్యలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ప్రభుత్వం సాధారణ రకం ధాన్యానికి క్వింటాకు రూ.2,369, గ్రేడ్ ఎ రకానికి రూ. 2,389 మద్దతు ధర ప్రకటించిందని, 17 శాతం లోపు తేమ ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. కొనుగోలు ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.



పార్వతీపురం రూరల్: అధికారులతో మాట్లాడుతున్న జేసీ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి

పర్యాటక ప్రాంతాలుగా సహజ సిద్ధ జలపాతాలు

- కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి

గుమ్మలక్ష్మీపురం: జిల్లాలో ఉన్న సహజ సిద్ధ జలపాతాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దనున్నట్లు కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గుమ్మలక్ష్మీపురం మండలంలోని తాడికొండ గ్రామ సమీపంలో గల మొగనాళి జలపాతాన్ని జేసీ యశ్వంత్ కుమార్ రెడ్డి, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిలతో కలిసి పర్యాటకుల సందర్శనార్థం కలెక్టర్ గురువారం ప్రారంభించారు. అంతేకాకుండా పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన టీ/ కాఫీ స్టాల్, ఫాస్ట్‌ఫుడ్ స్టాల్‌ను ప్రారంభించారు. జలపాతానికి పూజలు చేసి హారతి ఇచ్చారు. అలాగే జలపాతం సందర్శనకు కేటాయించిన తొలి టికెట్‌ను కలెక్టర్ కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ఈ జలపాతాన్ని మరింత అభివృద్ధి చేస్తామని, అందులో భాగంగా త్వరలో అడ్వెంచర్ స్పోర్ట్స్, క్లైంబింగ్ రాక్‌ను ఏర్పాటు చేస్తామని, ఈత కొట్టేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. జిల్లాలో ఇలాంటి జలపాతాలు అనేకం ఉన్నాయని, వాటనన్నింటినీ అభివృద్ధి చేసి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. తద్వారా స్థానిక యువత, ఎస్‌హెచ్‌జీ మెంబర్లకు ఉపాధి అవకాశం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తాడికొండ గ్రామానికి వచ్చి మొగనాళి గెడ్డ జలపాతానికి వెళ్లాలనుకునే వారిని అక్కడికి చేర్చేందుకు మళ్లీ తీసుకువచ్చేందుకు సాధారణ ఖర్చులతో బైకర్స్‌ను కూడా గుర్తించామని, జిల్లా వెబ్‌సైట్‌లో ఈ బైకర్స్ వివరాలన్నీ ఉంటాయన్నారు. ఎవరికీ ఇబ్బంది వచ్చినా కాల్ చేసేందుకు వీలుగా ఒక టూరిజం కంట్రోల్ పాయింట్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సుధారాణి, తహసీల్దార్ ఎస్.శేఖర్, ఎంఈఓ బి.చంద్రశేఖర్, వెలుగు ఏపీఎం సతీష్, ఏఎంసీ చైర్మన్ కె.కళావతి, తాడికొండ సర్పంచ్ ఎం.జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.



మొగనాళి జలపాతం వద్ద పూజలు చేస్తున్న కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి చిత్రంలో జేసీ యశ్వంత్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే జగదీశ్వరి

అబ్బా ఇంత చీపా..!



- జామకాయలు కిలో రూపాయి
- అల్లం, బీరకాయ, పచ్చిమిర్చి కిలో రూ.3
- స్కిన్‌లెస్ చికెన్ పేపర్ రేటుపై రూ.92 తగ్గింపు
- 21 కూరగాయలు కిలో చొప్పున రూ.170 నుంచి రూ.255
- గురుకులాల విద్యార్థుల భోజన మెనూకు టెండర్లు

పైన పేర్కొన్న రేట్లు ఏ మార్కెట్‌లో ఉన్నాయా? అని ఆలోచిస్తూ కూరగాయల సంచి తీసుకుని బయల్దేరుతున్నారా? అయితే ఆగండాగండి. ఈ రేట్లు బయట మార్కెట్‌లోనివి కాదు. మరి ఇంత చీప్ రేట్లకు ఎవరు కూరగాయలు, చికెన్ ఇస్తున్నారని ఆలోచిస్తున్నారా? ఇక్కడే ఉంది మతలబు. ఇటీవల సీతంపేట ఐటీడీఏ పరిధిలో గల గిరిజన గురుకులాలు, ఏకలవ్య పాఠశాలల విద్యార్థులకు భోజనాల కోసం సరుకుల సరఫరాకు అధికారులు టెండర్లు నిర్వహించారు. ఈ నేపథ్యంలో కొన్ని కూరగాయలు, చికెన్ వంటివి కారుచౌకగా సరఫరా చేస్తామని టెండరు దారులు కోట్ చేసి పాడేశారు. చౌకగా సప్లై చేస్తామని టెండర్లు పాడేసిన టెండర్‌దారులు సకాలంలో వాటిని నాణ్యమైనవి పంపిణీ చేస్తారా? లేదా? అనేది ప్రస్తుతం ప్రశ్నార్థకమైంది.

సీతంపేట: గిరిజన గురుకుల విద్యాసంస్థలకు మెనూలో భాగంగా కూరగాయలు, చికెన్, అరటి పండ్లు వంటివి విద్యార్థులకు వండి వడ్డిస్తారు. వాటిని టెండర్ల ద్వారా మాత్రమే కొనుగోలు చేయాలి. బయట మార్కెట్‌లో కొనుగోలు చేయడానికి వీలులేదు. తక్కువ రేటుకు సప్లై చేస్తే ప్రభుత్వానికి ఆదాయం సమకూరినట్లవుతుందని టెండర్ దారులు వేసిన రేట్లను అధికారులు ఖరారు చేశారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో 4 గిరిజన గురుకుల పాఠశాలలు, 4 గురుకుల జూనియర్ కళాశాలలు, 2 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు, 2 మినీగురుకుల పాఠశాలలు నిర్వహిస్తున్నారు. మొత్తం 4,126 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురుకుల పాఠశాలలు, కళాశాలలు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు భోజన సదుపాయానికి సరుకుల సరఫరాకు గత నెల 26న స్థానిక ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో టెండర్లు నిర్వహించగా సుమారు 15 మంది టెండర్‌దారులు పాల్గొన్నారు. ఒక్కో పాఠశాల, కళాశాలలకు ఒక్కో రేటుకు ఒక్కో టెండర్‌దారు తక్కువ రేట్లకు టెండర్ దక్కించుకున్నారు. రెండు రోజుల కిందట ఐటీడీఏ అధికారులు టెండర్ దారులు సరుకులు సరఫరా చేయడానికి అనుమతి కూడా ఇచ్చారు.

కిలో జామకాయలు రూపాయికే?

కిలో జామకాయలు రూపాయికి భామిని ఈఎంఆర్ఎస్ పాఠశాలకు సరఫరా చేయడానికి ఒక టెండర్ దారు టెండర్ దక్కించుకున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ.50 ధర పలుకుతోంది. వాటిని రూపాయికి ఎలా పంపిణీ చేస్తారో ఆయనకే తెలియాలి. మరికొందరు మిగతా పాఠశాలలకు రూ.కిలో 35, రూ.39కి జామకాయలు సప్లై చేయడానికి టెండర్ దక్కించుకున్నారు. ఈ ధరలు కాస్త సమంజసంగా ఉన్నా, రూపాయికి సప్లై చేస్తామని ముందుకు రావడం గమనార్హం. బీరకాయలు కిలో రూ.3 నుంచి రూ.4కు సప్లై చేయడానికి ముందుకు వచ్చారు. వాటి ధర మార్కెట్‌లో కిలో రూ.40కి తక్కువగా లేదు. కాలిఫ్లవర్ రూ.3 నుంచి రూ.4, రూ.5కు, పొడుగు చిక్కుడు రూ.3, నుంచి రూ.4, పచ్చిమిర్చి కిలో రూ.3, అల్లం కిలో రూ.3కు మునగకాడలు, ముల్లంగి, అరటికాయలు, పాలకూర, మెంతికూర, గోంగూర కిలో రూ.3కు సప్లై చేయడానికి టెండర్ దక్కించుకున్నారు. ఉల్లి కిలో రూ.4, నుంచి రూ.6, రూ.10కి టెండర్ దక్కించుకున్నారు. టమాటోలు కొన్ని విద్యాసంస్థలకు కిలో రూ.3, నుంచి రూ.4, రూ.6కు పంపిణీ చేయనున్నారు. బీట్‌రూట్ కిలో రూ.3కు సరఫరా చేయడానికి నిర్ణయించారు. ఒక్కో పాఠశాలలకు అన్ని కూరగాయలు కలిపి కిలో రూ.170 నుంచి రూ.255 వరకు సప్లై చేయడానికి టెండర్లు దక్కించుకున్నారు.




ఐటీడీఏలో టెండర్లు నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

స్కిన్‌లెస్ చికెన్ పేపర్ ధరపై రూ.96 తగ్గింపు

స్కిన్‌లెస్ చికెన్ పేపర్ ధరపై కిలో రూ.96 తగ్గింపునకు సప్లై చేయడానికి ఒకరు ముందుకు వచ్చారు. మరికొందరు కిలో చికెన్‌పై రూ.89, 91, 92, 93 పేపర్ ధరపై తగ్గించడానికి ఒక్కో విద్యాసంస్థకు టెండర్ వేశారు. ఉదాహరణకు ఒక రోజు కిలో చికెన్ దర రూ.220 మార్కెట్‌లో ఉంటే అది పత్రికలో ప్రచురితమవుతుంది. ఆ ధరలో రూ.96 తీసివేస్తే కిలో రూ.124 కే సరఫరా చేయాలి. ఇది సాధ్యమా అని కొందరు చర్చించుకుంటున్నారు.

సక్రమంగా సరఫరా చేయకపోతే చర్యలు



టెండర్లు ఖరారైన టెండర్‌దారులు సకాలంలో గురుకుల విద్యాసంస్థలకు నాణ్యమైన కూరగాయలు, చికెన్ వంటివి సప్లై చేయకపోతే చర్యలు తప్పవు. ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నాం. పంపిణీ సరిగా లేకపోతే టెండర్లు రద్దు చేయనున్నాం.

అన్నదొర, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ, సీతంపేట

క్లుప్తంగా

వైద్యరంగంలో మత్తు వైద్యులది కీలక ప్రాత

• సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్



ర్యాలీలో పాల్గొన్న సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజ

విజయనగరంఫోర్ట్: వైద్యరంగంలో మత్తు వైద్యులది కీలకపాత్ర అని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజ అన్నారు. ప్రపంచ మత్తు వైద్యుల దినోత్సవం సందర్భంగా సర్వజన ఆస్పత్రిలో నిర్వహించిన ర్యాలీని ఆమె గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యవసర కేసులకు వైద్యం అందించడంలోనూ, శస్త్ర చికిత్స చేయడానికి అవసరమైన మత్తు ఇచ్చేది మత్తు వైద్యులేనన్నారు. కోవిడ్ తర్వాత మత్తు వైద్యులకు మంచి గుర్తింపు వచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో మత్తు వైద్య విభాగం అధిపతి డాక్టర్ డి.జయధీర్‌బాబు, ఆర్థో హెచ్ఓడీ డాక్టర్ లోక్‌నాథ్, మానసిక విభాగం హెచ్ఓడీ డాక్టర్ శారద తదితరులు పాల్గొన్నారు.

సాలిపేటలో బంగారం చోరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న గజపతినగరం పోలీసులు

గజపతినగరం: మండలంలోని సాలిపేట గ్రామానికి చెందిన రొంగలి శంకరరావు ఇంట్లో బంగారం చోరీకి గురి కావడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.కిరణ్ కుమార్ నాయుడు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బుధవారం ఉదయం రొంగలి శంకరరావు తన ఇంటికి తాళం వేసి భార్య పద్మతో కలిసి వ్యవసాయ పనుల నిమిత్తం బయటకు వెళ్లాడన్నారు. పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వచ్చి చూసే సరికి తలుపులు తెరిచి ఉన్నాయని, అలాగే బీరువా తలుపులు కూడా దొంగలు పగుల గొట్టారన్నారు. బీరువాలో ఉండాల్సిన సుమారు మూడు తులాలు బంగారం పుస్తెల తాడు, రెండు శతమానాలను దొంగిలించినట్లు బాధితుడు శంకరరావు ఫిర్యాదు చేశాడని తెలిపారు. ఈ మేరకు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్ కుమార్ నాయుడు తెలిపారు.

మూగ బాలికపై వృద్ధుడి లైంగిక దాడి యత్నం

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం గ్రామంలో ఓ మూగ బాలికపై వృద్ధుడు లైంగికదాడి యత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి ఇద్దరు కుమార్తెలు కాగా పెద్ద కుమార్తె మూగబాలిక. బుధవారం రాత్రి 7 గంటల సమయంలో ఇంటి సమీపంలో ఒంటరిగా ఉన్న బాలిక నోటిపై చెయ్యిపెట్టి తన ఇంట్లోకి వృద్ధుడు లాక్కెల్లాడు. దీంతో బాలిక కేకలు వేయడంతో స్థానికులు వచ్చి వృద్ధుడి బారి నుంచి బాలికను రక్షించారు. బాధితురాలి తండ్రి గురువారం జామి మండలం తాండ్రంగి గ్రామానికి చెందిన మానవహక్కుల సంఘం ప్రతినిధి కొత్తలి గౌరునాయుడికి ఫిర్యాదు చేయగా ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం సాయంత్రం సీఐ నారాయణమూర్తిని వివరణ కోరగా ఫిర్యాదు అందిందని విచారణ చేయాల్సి ఉందన్నారు.

సీపీఆర్‌పై అవగాహన తప్పనిసరి



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం: ప్రతిఒక్కరూ సీపీఆర్(కార్డియో పల్మనరీ రీససియేషన్)పై అవగాహన కలిగి ఉండడం తప్పనిసరి అని మాజీ ఎంపీ, మాజీ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు తెలిపారు. నగరంలోని 42వ డివిజన్ అయ్యన్నపేట వాకింగ్ ట్రాక్ వద్ద శ్రీసాయికృష్ణ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై గురువారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన.. గుండెపోటుకు గురైన వ్యక్తికి తక్షణమే సీపీఆర్ చేయాలని, దీనిపై అందరూ అవగాహన కలిగి ఉంటే ప్రాణాలు కాపాడవచ్చని చెప్పారు. అనంతరం సీపీఆర్ ఏ విధంగా చేయాలి..దాని ప్రయోజనాలను వివరించారు. అందరూ రోజూ వ్యాయామం చేస్తూ పౌష్టికాహారం తీసుకుంటే గుండె సమస్యల నుంచి దూరంగా ఉండొచ్చన్నారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ సభ్యులు కె.సత్యనారాయణ, పి.అప్పలరాజు, కె.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹147	₹264	₹274

ఆనందం వెంబడి అంధకారం

• బాణసంచా పేల్చడంలో జాగ్రత్తలు పాటించాలి
• పెద్దలు వెంట ఉంటే ఆనందం మీ వెంటే

రామభద్రపురం: జాతి, కుల, మత,వర్గ విభేదాలను విస్మరించి సమైక్యంగా ఆనందోత్సాహాలతో జరుపుకునే పండగ దివ్య దీపావళి. చీకటిని పారదోలి వెలుగులు నింపే పండగగా, విజయానికి ప్రతీకగా దీపావళిని ఏటా ఆశ్వయుజ మాసంలో అమావాస్య రోజున జరుపుకోవడం ఆనవాయితీ. అయితే దీపావళిని వేడుకగా జరుపుకునే క్రమంలో చాలా ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగి పలువురు గాయపడుతున్నారు. టపాసులు పేల్చే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. బాణసంచాలోని రసాయనాలతో కళ్లు దెబ్బతింటాయి. సల్ఫర్, గన్‌పౌడర్ లాంటి రసాయనాల ప్రభావం వల్ల కళ్ల నుంచి నీరు కారడం, కళ్ల మంటలు, దురద వంటి ప్రభావాలు ఉంటాయి. ఒక్కోసారి కళ్లు పూర్తిగా కనబడకుండా పోతాయి.

నిఘాతోనే అక్రమానికి అడ్డు కట్ట

రూ.లక్షల విలువైన సరుకును ఎలాంటి అనుమతులు లేకుండా దిగుమతి చేసుకుని నిల్వ ఉంచుతున్నారు.పండగ రోజు విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. కొందరైతే ఏకంగా నివాస ప్రాంతాల మధ్య నిబంధనలు పాటించకుండా నిల్వ చేస్తున్నారు. అలాగే తాత్కాలికంగా అనుమతులు తీసుకున్న దుకాణాల వ్యాపారులు మిగిలిన సరుకును కొన్నచోటకే తిరిగి పంపాల్సి ఉంటుంది. కానీ కొందరు అలా చేయడం లేదు.పలు చోట్ల గుట్టుగా నిల్వ చేసి ఇతర సమయాల్లోనూ అమ్మేస్తున్నారు.కొందరైతే ఎలాంటి అనుమతులు లేకపోయినా పొరుగు ప్రాంతాల నుంచి పేలుడు పదార్థాలు తెప్పించి ఇళ్లలోనే టపాసులు తయారు చేస్తుండడం ఆందోళన కలిగించే పరిణామం. పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక శాఖ అధికారులు స్పందించి తనిఖీలు చేయకపోతే అనుమతి లేని వారు విక్రయాలతో పాటు చేసే నిల్వలతో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు.



రామభద్రపురంలో విక్రయిస్తున్న టపాసులు (ఫైల్)

ప్రమాద నివారణ, జాగ్రత్తలు ఇలా..

• టపాసులు వెలిగించిన వెంటనే దూరంగా జరగాలి
• పేలని టపాసులపై వంగి చూడడం మంచిది కాదు
• కంటికి రక్షణగా ప్లెయిన్ అద్దాలు వాడడం మంచిది
• పేరున్న సంస్థలు తయారు చేసిన టపాసులనే ఎంపిక చేసుకోవాలి
• పిల్లలు, యువకులు, మహిళలు ఇలా ఎవరు ఏ రకం టపాసులు కాల్చాలో ముందే నిర్ణయించుకుని ప్రణాళిక మేరకే కొనాలి
• ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే వైద్యాధికారిని సంప్రదించాలి
• బాణసంచాను కిచెన్, పొయ్యి ఉన్న ప్రాంతాల్లో ఉంచకూడదు
• బాణసంచా కాల్చేటప్పుడు వదులుగా ఉన్న దుస్తులు ధరిస్తే అవి వేలాడుతూ అంటుకునే ప్రమాదం ఉంది. కొద్దిగా బిగుతైన కాటన్ దుస్తులను మాత్రమే ధరించాలి
• చిన్న పిల్లలను ఎత్తుకుని బాణసంచా కాల్చకూడదు.పెద్ద వారి సహాయం లేకుండా పిల్లలు వారంతట వారే బాణసంచా కాల్చరాదు
• అప్పుడే పుట్టిన చిన్నారులు, గర్భిణులు, వృద్ధులపై బాణసంచా శబ్దాలు ఎక్కువ ప్రమాదం చూపుతాయి. ప్రధానంగా చెవులు దెబ్బతింటాయి. చెవులను రక్షించుకోవడానికి ఇయర్ ప్లగ్స్ కొంత మేరకు ఉపయోగపడతాయి. పెద్ద శబ్దాలతో పేలే టపాసులు కాకుండా చాలా తక్కువ శబ్దంతో పూలలాంటి వెలుగులు కురిపించే చిచ్చుబుడ్లు, కాకర పువ్వొత్తులు, పెన్సిళ్లు, భూచక్రాలు వంటివి కాల్చడం మంచిది.భూచక్రాలు, బొట్లు కూడా ఒక్కోసారి పేలే ప్రమాదం ఉంది. వాటిని అగ్గిపుల్లలతో కాకుండా కాకర పువ్వొత్తులతో కాల్చడం మంచిది.

సొంత వైద్యం వద్దు



టపాసులు కాల్చేటప్పుడు ఏదైనా ప్రమాదం జరిగితే కొందరు సొంత వైద్యం చేస్తుంటారు. ఇది మంచిది కాదు. వెంటనే దగ్గరలో ఉన్న డాక్టర్‌ను సంప్రదించాలి. ప్రథమ చికిత్స చేసే ముందు కాలిన గాయంపై చల్లని నీరు పోయాలి. అంతేగానీ ఐస్‌ముక్కలతో రుద్దకూడదు. వెన్న గ్రీజ్, ఇతర పౌడర్లు వంటివి రాయకూడదు. వాటివల్ల ఇన్ఫెక్షన్ సోకే ప్రమాదం ఉంది. దిలీప్‌కుమార్, వైద్యాధికారి, పీహెచ్‌సీ, రామభద్రపురం

కాల్చే ముందు అప్రమత్తం



పెద్దవాళ్ల పర్యవేక్షణలోనే చిన్నారులు బాణసంచా కాల్చడం ఉత్తమం. టపాసులు కాల్చేటప్పుడు నీళ్లు దగ్గర పెట్టుకోవాలి.ఇంటి కిటికీలు, తలుపులు మూసివేయాలి. ఉదయం 6 నుంచి 8 వరకు,రాత్రి 8 నుంచి 10 గంటల వరకు మాత్రమే టపాసులు కాల్చాలి.దీపావళి పండుగ రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరిగినా పోలీసులకు సమాచారం ఇవ్వాలి. అలాగే ఏ విధమైన అనుమతులు లేకుండా బాణ సంచా విక్రయిస్తే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం. వి.ప్రసాదరావు, ఎస్సై, రామభద్రపురం

గిరిజనం గుండెఘోష పట్టదా..?



ప్లకార్డులు, ఇటీవల మృతిచెందిన విద్యార్థుల ఫొటోలతో కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు

• ప్రజాసంఘాల నాయకులు
• కలెక్టరేట్ ఎదుట నిరసన

పార్వతీపురం రూరల్: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల వరుస మరణాలు జరుగుతున్న నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. గిరిజన విద్యార్థుల ప్రాణాలంటే ప్రభుత్వానికి లెక్క లేదా? ఇంకెంతమంది విద్యార్థులను నిర్లక్ష్యంతో బలిచేస్తారంటూ ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిరసనలో గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్‌లు మాట్లాడుతూ గిరిజన విద్యాసంస్థలు విద్యార్థుల పాలిట నిర్లక్ష్యంతో వారి ప్రాణాలను బలిగొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం కారణంగానే పసిమొగ్గలు పిట్టల్లా రాలిపోతున్నాయని ఈ మరణాలకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లను పత్రికాముఖంగా ప్రభుత్వానికి తెలియజేశారు. విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించాలి. వసతిగృహాల్లో మెరుగైన సదుపాయాలు, వైద్యసేవలు అందించాలి. మృతిచెందిన గిరిజన విద్యార్థుల కుటుంబాలకు రూ. 25లక్షల నష్టపరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి. అలాగే విద్యార్థుల మరణాలకు కారణమైన వారిపై చర్యలు తీసుకుని సురక్షితమైన తాగునీటిని విద్యార్థులకు అందించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో ఇటీవల మృతిచెందిన విద్యార్థుల ఫొటోలు చూపిస్తూ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు వికాస్, బుచ్చి, కార్తీక్, చరణ్, గణేష్, మల్లేష్, చందు, గౌరీశ్వరి, చిన్నారావు, కొందరు తల్లిదండ్రులు, పలు పార్టీల నాయకులు శివప్రసాద్, గౌరీశంకరరావు, ఈవీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు అప్పగింత

విజయనగరం క్రైమ్: నగరంలో అయ్యన్నపేటకు చెందిన ఇద్దరు యువతులు అదృశ్యమైన కేసును పోలీసులు ఛేదించారు. యువతుల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ ఆర్వీకే చౌదరి మిస్సింగ్ కేసు నమోదుచేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక పోలీస్ బృందంతో దర్యాప్తు చేశారు. ఇద్దరినీ తెలంగాణా రాష్ట్రంలో గుర్తించి తీసుకొచ్చారు. తల్లిదండ్రులకు గురువారం అప్పగించారు. అయితే, వారు తల్లిదండ్రుల మాట వినకుండా తిరిగి తమ దారిలో వెళ్లిపోయినట్టు తెలిసింది.

పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి చర్యలు

సాక్షి ఎఫెక్ట్



ధారగెడ్డకు వెళ్లే దారిలో ఉన్న తుప్పలు, డొంకలు తొలగిస్తున్న దృశ్యం

పాచిపెంట: మండలంలోని పలు పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నారు. అభివృద్ధి చేస్తే 'అరుకుకు దీటుగా అందాలు' శీర్షికన గత నెల 29వ తేదీన సాక్షిలో ప్రచురితమైన కథనంపై కలెక్టర్ స్పందించారు. మండలంలోని పర్యాటక ప్రదేశాలను గుర్తించి అభివృద్ధి పనులు చేపట్టాలని వెలుగు డీపీఎం శ్రీనివాసరావుకు బాధ్యతలు అప్పజెప్పారు. అందులో భాగంగా ధారగెడ్డకు వెళ్లే దారిలో ఉన్న తుప్పలు డొంకలు గురువారం తొలగించారు. ఈ పనులు పర్యవేక్షిస్తున్న వెలుగు ఏపీఎం శ్రీరాములు 'సాక్షి' తో మాట్లాడుతూ త్వరలో రహదారి నిర్మాణం చేపట్టనున్నామని, వాటితోపాటు ప్రత్యక్షంగా పర్యాటకులతో మాట్లాడి అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపడతామన్నారు. అలాగే వెలుగు మహిళా సంఘాల సభ్యులకు లోన్ రూపంలో డబ్బులు మంజూరు చేసి పర్యాటక ప్రదేశాల్లో షాపులు ఏర్పాటు చేయించి పర్యాటకులకు అవసరమైన వస్తువులను అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



అప్పారావు మృతదేహం

నెల్లిమర్ల: స్థానిక చంపావతినదిలో బుధవారం గల్లంతైన కనకల అప్పారావు(46) మృతదేహం లభ్యమైంది. జరజాపుపేటకు చెందిన కనకల అప్పారావు ధామస్‌పేట వద్ద చంపావతినదిలో స్నానానికి దిగి నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో మునిగిపోయి గల్లంతైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎన్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపకసిబ్బంది గాలింపు చేపట్టగా కొండపేట వెళ్లే రహదారిలో జూట్‌మిల్లు వద్ద మృతదేహం గురువారం లభ్యమైంది. మృతదేహానికి పంచనామా అనంతరం పోస్టుమార్టం కోసం పోలీసులు తరలించారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి–చీపురుపల్లి రైల్వేస్టేషన్‌ల మధ్య రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని శ్రీకాకుళం జీఆర్‌పీ హెచ్‌సీ ఎస్.మధుసూదనరావు తెలిపారు. పాండిచ్చేరి నుంచి హౌరా వెళ్లే రైలు ఢీకొట్టగా మృతి చెందాడన్నారు. మృతుడి వయస్సు సుమారు 45 సంవత్సరాలు ఉంటుందని, చీపురుపల్లి ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీలో మృతదేహం ఉంటుందని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్ 9110305494 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి..



అచ్యుతరావు మృతదేహం

గుర్ల: మండలంలోని తెట్టంగి శివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పెనుబర్తికి చెందిన తాడేల అచ్యుతరావు (35) మృతి చెందాడు. ఈ ఘటన వివరాల్లోకి వెళ్తే..దీపావళి సందర్భంగా బాణ సంచా కొనుగోలు చేయడానికి పెనుబర్తి నుంచి గవిడి పేట వెళ్తుండగా తెట్టంగి దాటిన తర్వాత బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న స్తంభాన్ని ఢీకొట్టాడు. దీంతో జరిగిన ప్రమాదంలో అచ్యుతరావు అక్కడికక్కడే మృతిచెందాడు. అదే బైక్‌పై వెళ్తున్న గుషిడి నారాయణ రావుకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాల పాలైన వ్యక్తిని చీపురుపల్లి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. మృతుడికి భార్య పార్వతి, ఇద్దరు కుమారులు వసంత్ కుమార్, తరుణ్ ఉన్నారు.

పూరిల్లు దగ్ధం



కాలి బూడిదైన పూరిల్లు

సంతకవిటి: మండలంలోని మండాకురిటి గ్రామానికి చెందిన బొమ్మరిల్లు రాజారావు పూరిల్లు గురువారం అగ్నికి ఆహుతైంది. సమాచారం మేరకు పొందూరు అగ్నిమాపక శాఖ సిబ్బంది గ్రామానికి చేరుకుని మంటలను అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో దాదాపు రూ.1.5 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక శాక సిబ్బంది తెలిపారు. ప్రమాదానికి కారణం తెలియరాలేదన్నారు. ఇల్లు కాలిపోవడంతో కుటుంబం వీధిన పడిందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని రాజారావు కోరుతున్నాడు.

హెచ్‌ఐవీ రోగులకు శస్త్ర చికిత్సలు

• స్పందించిన సర్వజన ఆస్పత్రి వైద్యాధికారులు

సాక్షి ఎఫెక్ట్

విజయనగరంఫోర్ట్: హెచ్‌ఐవీ రోగులకు శస్త్రచికిత్సలు చేయడం లేదనే అంశంపై సాక్షిలో ఈనెల 14వ తేదీన హెచ్‌ఐవీ రోగుల పట్ల వివక్ష శీర్షికన ప్రచురించిన కథనానికి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వైద్యాధికారులు స్పందించారు. ఆస్పత్రిలో హెచ్‌ఐవీ, హెచ్‌బీఎస్ఏజీ రోగులకు శస్త్రచికిత్సలు చేస్తున్నామని తెలిపారు. ఒక వేళ ఎవరైనా శస్త్రచికిత్సలు చేయడానికి నిరాకరిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజ తెలిపారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి...



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ సురేష్‌బాబు

దత్తిరాజేరు: మండల కేంద్రమైన దత్తిరాజేరులో గురువారం నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు పువ్వల శ్రీనివాసరావుతో పాటు పది కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మహదేవ్ ఫణీంద్రుడు, మజ్జి అప్పలనాయుడు ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందేవని, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజల సంక్షేమం కుంటుపడిందని ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే పేర్కొన్నారు.

నేడు సబ్‌జూనియర్స్ ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న సబ్ జూనియర్స్ ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక ఈనెల 17న నిర్వహించనున్నట్లు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ చీఫ్ కోచ్ డీవీ చారిప్రసాద్ తెలిపారు. నగరంలోని విజ్జీస్టేడియంలో ఉదయం 9 గంటల నుంచి ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఎంపికల్లో 2012 నుంచి 2014 సంవత్సరాల మధ్య జన్మించిన బాల, బాలికలు పాల్గొనేందుకు అర్హులన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జారీ చేసిన గుర్తింపు కార్డుతో పాటు ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలను వెంట తీసుకురావాలని సూచించారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు కాకినాడలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నామన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జీఎస్టీ తగ్గింపు వల్ల అన్ని వర్గాలకు ప్రయోజనం



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డి

విజయనగరం టౌన్: జీఎస్టీ శ్లాబ్‌ను రెండుకు తగ్గించడం వల్ల అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూరుతుందని కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రాంతీయ రవాణాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ వాహన ర్యాలీని కలెక్టరేట్ వద్ద గురువారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి ఆర్అండ్‌బీ జంక్షన్, సంతకాల వంతెన, ఆర్‌టీసీ కాంప్లెక్స్, బాలాజీ జంక్షన్ వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జేసీ సేతు మాధవన్, డీఆర్‌ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, ఉప రవాణాధికారి డి.మణికుమార్, ఆర్‌టీఓ విమల, సీనియర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు దుర్గాప్రసాద్, రవిశంకర్ ప్రసాద్, శివరాంగోపాల్, సంగీత కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన శాఖ మంత్రి బాధ్యత వహించాలి

• మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



మౌనం పాటిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, వైఎస్సార్‌సీపీ నాయకులు

సాలూరు: మంచి చదువులు చదివి జీవితంలో గొప్పస్థాయికి ఎదిగి తమ కష్టాలను శాశ్వతంగా దూరం చేస్తారని కోటి ఆశలతో బిడ్డలను పాఠశాలలకు పంపగా అక్కడ సరైన సదుపాయాలు లేక అనారోగ్యాలకు గురై అమాయక గిరిజన బిడ్డలు మరణిస్తున్నారు. ఆ బిడ్డల తల్లిదండ్రులకు సంబంధిత శాఖ మంత్రి, ప్రభుత్వం ఏం సమాధానం చెబుతారని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన సాలూరు పట్టణంలోని తన స్వగృహంలో పట్టణంలో వైఎస్సార్‌సీపీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనారోగ్యానికి గురై మరణించిన విద్యార్థులు, దివంగత మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ పువ్వలనాగేశ్వరరావులకు నివాళులు అర్పించి కొన్ని నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం రాజన్నదొర మాట్లాడుతూ, గిరిజన విద్యార్థుల ప్రాణాలు రక్షించడంలో గిరిజనసంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, టీడీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యాయని, ఫలితంగా గిరిజన విద్యార్థులు మృత్యువాత పడుతున్నారని గిరిజన విద్యార్థులు మరణిస్తుంటే గిరిజన శాఖ మంత్రికి బాధ్యత లేదా? అని ప్రశ్నించారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 13 మంది విద్యార్థులు మృతిచెందారని, సాలూరు నియోజకవర్గంలో ఇద్దరు మృతిచెందారన్నారు. కురుపాం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 175 మంది పచ్చకామెర్లతో బాధపడుతూ కురుపాం, పార్వతీపురం, విజయనగరం, విశాఖపట్నం ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నా సంబంధిత గిరిజన సంక్షేమశాఖమంత్రికి, ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేకపోవడం శోచనీయమన్నారు.

జాతీయ స్థాయిలో ఫిర్యాదు చేశాం

విద్యార్థులు పచ్చకామెర్లతో చనిపోతున్నా, సెరిబ్రల్ మలేరియా, జ్వరంతో చనిపోతున్నట్లు చూపిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల మరణాలపై జాతీయమానవహక్కుల సంఘానికి, జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఢిల్లీలో ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. జిల్లాలో ఇంత మంది విద్యార్థులు మృతిచెందడం వల్ల జిల్లా మంత్రిగా ఆమె విఫలమయ్యారని, ఈ శాఖలో మరణాలపై సదరు మంత్రి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.